ఆర్థిక సాయం అందజేత



అల్విన్‌కాలనీ: జయానగర్‌ కాలనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సజ్జల రమేశ్‌ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేశ్‌ గౌడ్‌ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి డీవీజీ ట్రస్ట్‌ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో దాతి రమేశ్‌, క్రాంతిలాల్‌, కాలనీవాసులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షల కోసం క్యూలో జనం

అల్విన్‌కాలనీ: గణేశ్‌ ప్యాకర్స్‌ అండ్‌ మూవర్స్‌ అండ్‌ టెంట్‌హౌస్‌ ఆధ్వర్యంలో హైదర్‌నగర్‌ డివిజన్‌ ఆదిత్యనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక ప్రసాద్‌ హాస్పిటల్స్‌ వైద్యులు వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అంతకుముందు లోకాయుక్తా డీఎస్పీ విద్యాసాగర్‌ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సమ్మెట ప్రసాద్‌ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆదిత్యనగర్‌ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి గోపి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సురేశ్‌కుమార్‌, కరుణాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన మహిళలకు పరామర్శ



బాధిత మహిళకు నిత్యావసర సరుకులు ఇస్తున్న సతీశ్‌రావు

అల్విన్‌కాలనీ: బీరంగూడలోని ఓ షాపింగ్‌ మాల్‌లో పనికి వెళ్లి లిఫ్ట్‌ ప్రమాదానికి గురైన ఎన్టీఆర్‌నగర్‌ వాసులు జుబీనా సుల్తానా, హీనా, చంద్రకళ, మోహమ్మద్‌ జుబేదా ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు సోమవారం వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో సాయిగౌడ్‌, కల్యాణ్‌, రాజు, ఫజల్‌, బాలస్వామి, చంద్రశేఖర్‌,రహీం, కటిక రవి, ప్రీతి, లక్ష్మి, సుల్తానా బేగం, ఆఫ్రిన్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎదురుచూపు ఫలించేదెప్పుడు.?

- 3 నెలలుగా జీతాలు రాక.. సెలవులు లేక..
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌
- 20 ఏళ్ల నుంచి పని చేస్తున్నా.. రెగ్యులర్‌ కాలేదని ఆవేదన
- ప్రజా ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

తెలంగాణ ఇంటర్మీడియట్‌ విద్యాశాఖలో 24 ఏళ్ల నుంచి ఒకేషనల్‌ విభాగంలో కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌గా పనిచేస్తున్న అధ్యాపకులు నెలనెలా వేతనాలు రాక.. అనారోగ్య సమస్యలు వచ్చినా.. సెలవులు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్‌–మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్‌ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లు తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.
– సాక్షి,సిటీబ్యూరో



411 మంది ఒకేషనల్‌ కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌..

◆ తెలంగాణ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో పనిచేస్తున్న 411 మంది ఒకేషనల్‌ కాంట్రాక్ట్‌ లెక్చరర్లకు శాంక్షన్‌ పోస్టులు లేవనే సాకుతో రెగ్యులర్‌ చేయలేదని వారు చెబుతున్నారు. జిల్లా పరిధిలోని 6 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో పనిచేస్తున్న 12 మందిని రెగ్యులర్‌ చేయలేదంటున్నారు. ఏప్రిల్‌ నుంచి 3 నెలల జీతాలు ఇప్పటి వరకు రాలేదని వాపోతున్నారు. 2000 సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులుగా ఒకేషనల్‌ విభాగంలో పనిచేస్తున్న సీనియర్లకు ఇంటర్‌ విద్యాధికారుల తప్పిదం వల్ల రెగ్యులర్‌ కాలేదన్నారు.

కమలనాథన్‌ కమిటీ లెక్కల ప్రకారం..

◆ కమలనాథన్‌ కమిటీ లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాలు విడిపోయినప్పుడు తెలంగాణ ఇంటర్మీడియట్‌ విద్యకు 842 పోస్టులను అందించారు. కానీ ఇంటర్‌ విద్యాధికారులు గత ప్రభుత్వం చేపట్టిన రెగ్యులరైజేషన్‌ ప్రక్రియలో కేవలం 613 పోస్టులు మాత్రమే ఉన్నాయని, మిగతా ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్‌ చేయకుండా వదిలేశారని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వ జూనియర్‌ కాలేజీల్లో అవసరమైన శాంక్షన్‌ పోస్టులు మంజూరుచేసి, కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌ను రెగ్యులర్‌ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్‌ పార్టీ నేతలు అధికారంలోకి రాగానే విస్మరించడం దారుణమని, ఇప్పటికైనా న్యాయం చేయాలని ఒప్పంద అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌ను రెగ్యులర్‌ చేయాలి.



ప్రజా ప్రభుత్వం వెంటనే 411 పోస్టులను శాంక్షన్‌ చేసి ఒకేషనల్‌ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్‌ చేయాలి. పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలని సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో తీర్పును వెలువరించిందని, వాటి ఆధారంగా మాకు న్యాయం చేయాలి.
– రవిశంకర్‌, కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు

ఆరోగ్యం సరిగ్గా లేకున్నా.. సెలవులు ఇవ్వడం లేదు.



నెలనెలా జీతాలు ఇవ్వకపోవడంతో పాటు టైఫాయిడ్‌, డెంగీ వంటి జబ్బులు వచ్చినా వారం, 10 రోజులు ఆసుపత్రుల పాలైనా సెలవులు మంజూరు చేయడం లేదు. ఇంటర్‌ విద్యాధికారుల తప్పిదం వల్ల మాకు రెగ్యులరైజేషన్‌ కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోవాలి.
– గౌతమ్‌, జీజేసీ, మేడ్చల్‌

ప్రతినెలా జీతాలు చెల్లించాలి



3 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవటంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ప్రతినెల జీతాలు చెల్లించాలి. మమ్మల్ని రెగ్యులర్‌ చేయకపోవడంతో మహిళా అధ్యాపకులుగా పలు సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్నాం.
– హసీనా బేగం, జీజేసీ మల్కాజిగిరి

పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నాం



మాలో చాలా మంది కాంట్రాక్ట్‌ లెక్చరర్స్‌ రిటైర్మెంట్‌కు చేరువలో ఉన్నారు.రెగ్యులర్‌ చేయకపోవడం వల్ల తీవ్ర అన్యాయానికి గురికావాల్సి వస్తోంది. సమయానికి జీతాలు రాకపోవడంతో పిల్లల స్కూల్‌ ఫీజులు కట్టలేకపోతున్నాం.
– వంశీకృష్ణ, జీజేసీ, మల్కాజిగిరి

ఘనంగా బీఎస్‌ఎఫ్‌ ఆవిర్భావ దినోత్సవం



బీఎస్‌ఎఫ్‌ జెండాను ఎగురవేసిన శివకుమార్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భీమ్‌ ఆర్మీ స్టూడెంట్స్‌ ఫెడరేషన్‌ (బీఏఎస్‌ఎఫ్‌) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఏఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు తీగల శివకుమార్‌ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధించడమే లక్ష్యమని రానున్న స్థానిక ఎన్నికల్లో ఆజాద్‌ సమాజ్‌ పార్టీ పోటీ చేయనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్‌, షేక్‌ అమీర్‌ ఘోష్‌, ఎండీ మోయిన్‌, అయేషా సుల్తానా, ఫరిన్‌ బేగం, శోభన్‌ బాబు, గడ్డం ప్రవీణ్‌, అరుణ్‌ పాల్గొన్నారు.

సన్మానం



కార్యకర్తలను సన్మానించిన ఆలయ కమిటీ, నాయకులు

మోతీనగర్‌: బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేసి విజయవంతం చేసిన కార్యకర్తలను అల్లాపూర్‌ డివిజన్‌ వి. రామారావునగర్‌ నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ, వి. రామారావునగర్‌ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సన్మానించిన వారిలో నాగుల సత్యం గంగపుత్ర, బి. వెంకటయ్య యాదవ్‌, వెంకటరమణ, మహేశ్‌ యాదవ్‌, కృష్ణ, సీఆర్‌. శివ, ఆవుల సంజీవ్‌ పటేల్‌, ఎస్‌. నరసింహ యాదవ్‌, రామకృష్ణ, రాజు చారి, సాంబ తదితరులు పాల్గొన్నారు.

బోనాల శుభాకాంక్షలు

అల్విన్‌కాలనీ: చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌ రెడ్డి, పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని రామకృష్ణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి ఎమ్మెల్యే నివాసంలో సోమవారం మర్యాద పూర్వకంగా వారిని కలిశారు. ఈ సందర్భంగా వారికి బోనాల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ శ్రీకాంత్‌, శ్రీనివాస్‌, సంజీవరెడ్డి, రాజు యాదవ్‌, శ్రీధర్‌రావు, లక్ష్మయ్య, మల్లయ్య ఉన్నారు.



చేవెళ్ల మాజీ ఎంపీ, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీతో పురేందర్‌ రెడ్డి తదితరులు

మహిళలకు సర్టిఫికెట్ల అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కార్పొరేటర్‌ నర్సింహాయాదవ్‌

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని సెవెంత్‌–డే అడ్వంటిస్ట్‌ చర్చిలో శాంతి చారిటబుల్‌ ట్రస్ట్‌, హస్మత్‌పేట అడ్వంటిస్ట్‌ టైలరింగ్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ సంయుక్తాధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన 60 మంది మహిళలకు కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌ సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ పొందిన మహిళలకు సంస్థల ద్వారా కుట్టు మిషన్లు కూడా అందిస్తే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో సెవెంత్‌–డే అడ్వంటిస్ట్‌ చర్చి పాస్టర్‌, అనిల్‌కుమార్‌, నియోజకవర్గ క్రైస్తవ మైనార్టీల అధ్యక్షుడు దాది డేవిడ్‌, డాక్టర్‌ సనారాజు, రజినీ, ప్రసన్న, జ్యోతి, రవిప్రసాద్‌, మణిశంకర్‌, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర



రాయదుర్గం: నానక్‌రాంగూడలోని 'కావడ్‌ సేవా సంఘం' ఆధ్వర్యంలో శివ కావడి యాత్రను ఘనంగా నిర్వహించారు. హరహర మహాదేవ' అంటూ కావడి మోశారు. నానక్‌రాంగూడలోని జై వీర హనుమాన్‌ ఆలయంలో ప్రత్యేక పూజ అనంతరం కావడియాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై సంఘం ముఖ్య ప్రతినిధులను సత్కరించారు.ఆలయం నుంచి ఔటర్‌ రింగురోడ్డు అండర్‌బ్రిడ్జి నుంచి సర్వీస్‌రోడ్డు మీదుగా మంచిరేవులలోని శివాలయం వరకు యాత్ర కొనసాగింది. అనంతరం శివుడికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కావడి యాత్రలో గోషామహల్‌ ఎమ్మెల్యే రాజాసింగ్‌ పాల్గొనగా సంఘం ఆధ్వర్యంలో ఆయన్ని ఘనంగా సత్కరించారు.

మర్యాదపూర్వక కలయిక

అల్విన్‌కాలనీ: బాలానగర్‌ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌ రెడ్డిని తెలంగాణ స్టేట్‌ ఓసీ సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రమణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌ ఏసీపీతో భాస్కర్‌రెడ్డి

'ఈఎంఆర్‌ఐ'లో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్‌: గుండ్లపోచంపల్లిలోని ఈఎంఆర్‌ఐ గ్రీన్‌ హెల్త్‌ సర్వీసెస్‌ పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సంస్థ జిల్లా ప్రోగ్రామ్‌ మేనేజర్‌ నాగేందర్‌ తెలిపారు. 1962, 102 వాహనాల పైలెట్‌ (డ్రైవర్‌) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, బ్యాడ్జ్‌ నెంబర్‌తో కూడిన లైసెన్స్‌లు ఉండి పదోతరగతి చదివి 35 ఏళ్ల లోపు ఉన్న వారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.


'ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌ఎస్‌యూఐని రద్దు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు జీవన్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట ఎన్‌ఎస్‌యూఐ ఒడిసా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ ప్రధాన్‌ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థినులపై జరిగే లైంగిక దాడుల వెనుక ఎన్‌ఎస్‌యూఐ నేతల హస్తం ఉందని ఆరోపించారు. పృథ్వీతేజ, అలివేలి రాజు, హరిప్రసాద్‌, సాయి తేజ, దృహన్‌, శివ శంకర్‌ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌ విద్యార్థులకు ఫీజు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్‌ చదివే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఓయూలో మాట్లాడుతూ..బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధంలేకుండా బోధన ఫీజు మొత్తాన్ని చెల్లించాలని లేఖ ద్వారా సీఎం రేవంత్‌ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 10 వేల లోపు ర్యాంక్‌ విద్యార్థులకు మొత్తం ఫీజును చెల్లిస్తూ 10 వేల ర్యాంక్‌ దాటిన విద్యార్థులకు కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లించడం వలన మిగితా ఫీజు చెల్లించలేక అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఇతర కులాల మాదిరిగా ఫీజు చెల్లించాలని కోరారు.

ఆకట్టుకున్న పలహార బండ్ల ఊరేగింపు



పలహారం బండి ఊరేగింపులో టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం



పోతరాజులతో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌, నాయకులు


కూకట్‌పల్లి: కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు, డీజే పాటలు, డప్పులు, వాయిద్యాల మధ్య సోమవారం పలు డివిజన్లలో నిర్వహించిన పలహార బండ్ల ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పలుచోట్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌ పుష్పారెడ్డి, బీ బ్లాక్‌ అధ్యక్షుడు తూము వేణు, బేగంపేట శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీనగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్‌, గాజుల మహేశ్‌ గౌడ్‌, సాయి, కలికోట శంకర్‌, బాలరాజ్‌, శ్రవణ్‌, సప్పిడి భాస్కర్‌, రమాదేవి, గంధం చంద్రశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేట డివిజన్‌లో

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో పలహారం బండి ఊరేగింపులో మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో..

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: అంజయ్యనగర్‌, హస్మత్‌పేట, బృందావన్‌ కాలనీ, వల్లబ్‌నగర్‌, ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో అమ్మవారి అలయాల పలహార బండ్ల ఊరేగింపులు వైభవంగా జరిగాయి. బృందావన్‌ కాలనీలో స్థానిక కార్పొరేటర్‌ ముద్దం నర్సింహాయాదవ్‌, అంజయ్యనగర్‌లో కాంగ్రెస్‌ నాయకులు కనకరాజుయాదవ్‌, మల్లికార్జునయాదవ్‌, ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో బీజేపీ నాయకులు ఏనుగుల తిరుపతి యాదవ్‌, రాజు హస్మత్‌పేటలో వివిధ పార్టీల నాయకులకు నిర్వాహకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీల నాయకులు కర్రె జంగయ్య, పిట్ల రాజు, మక్కాల సత్యనారాయణ, బల్‌రాజు, నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, వాసు యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



పోతరాజులతో బీజేపీ నాయకులు తిరుపతి యాదవ్‌, రాజు తదితరులు



పలహారం బండి ఊరేగింపులో మాజీ కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌



మూసాపేటలో కళాకారుల విన్యాసం

అటు ప్రహరీ..ఇటు బారికేడ్లు..!

మూసాపేట, అల్లాపూర్‌ డివిజన్లలో రోడ్లకు అడ్డుగా నిర్మించిన ప్రహరీ

మోతీనగర్‌: వాహనదారులు సాధారణంగా ప్రధాన రహదారి గుండా వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. మరికొందరు సమయం లేకపోవడంతో దూర భారం తగ్గించుకునేందుకు మార్గమధ్యదారుల గుండా వెళ్తుంటారు. అయితే మూసాపేట, అల్లాపూర్‌ డివిజన్లలోని పలు ప్రాంతాల్లోని మార్గమధ్య దారులను బారికేడ్లు, ప్రహరీలతో మూసివేశారు. అల్లాపూర్‌ డివిజన్‌ గాయత్రీనగర్‌ నుంచి అయ్యప్ప సొసైటీకి వెళ్లే మార్గమధ్య రోడ్డుకు అడ్డంగా ప్రహరీ నిర్మించారు. దీంతో వాహనదారులు చేసేదేమి లేక పర్వత్‌నగర్‌ మీదుగా వెళ్తున్నారు. పర్వత్‌నగర్‌ చౌరస్తాలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌ జాం గంటల తరబడి ఉంటోంది. దీనికి తోడు హైటెక్‌ సిటీ మాదాపూర్‌, కొండాపూర్‌ ప్రాంతాలకు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు రాత్రీపగలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే వివేకానందనగర్‌ నుంచి మాదాపూర్‌ 100 ఫీట్ల రోడ్డు మీదుగా కొండాపూర్‌ వైపు వెళ్లే మార్గమధ్యలో వాహనాల రద్దీని సాకుగా చూపిస్తూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. అదే విధంగా మూసాపేట డివిజన్‌లోని పాండురంగనగర్‌ బస్టాప్‌ నుంచి మార్గమధ్య దారి మీదుగా సమీప కాలనీలు అవంతినగర్‌ తోట, ఈస్ట్‌కాలనీ, కబీర్‌నగర్‌, బబ్బుగూడకు వెళ్లే మార్గమధ్య దారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌, పోలీస్‌ పెట్రోలింగ్‌ వాహనాలు ప్రధాన రహదారి గుండా వెళ్లాలంటే గంటల తరబడి ట్రాఫిక్‌ జాం ఉంటుంది. దానికి ప్రత్యామ్నాయంగా మార్గమధ్యన దారులను మూసివేయడంతో ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్వ మోతీనగర్‌ డివిజన్‌లోని పలు కాలనీల్లో మూసివేసిన మార్గమధ్య దారులను తక్షణమే పునరుద్ధరించాలని ఆయా కాలనీలు, బస్తీలవాసులు కోరుతున్నారు.



వివేకానందనగర్‌ నుంచి మాదాపూర్‌, కొండాపూర్‌కు వెళ్లే మార్గమధ్య దారిలో బారికేడ్లు



గాయత్రీనగర్‌ నుంచి అయ్యప్ప సొసైటీ రోడ్డు మధ్యలో నిర్మించిన ప్రహరీ